# రాధాకృష్ణ

జగన్మోహనాకారుడైన వేణుగోపాలుడు సురపొన్నచెట్టుక్రింద నిలబడి వేణు రంధ్రాలను తన అధర సుధారసంతో నింపుతున్నాడు.

ఆ వేణుగానం జగమంతా వ్యాపించింది. జగజ్జీవనకారిణి అయింది.

రాధముఖం వికసించింది. ఆమె హృదయంలో అమృతమథనం జరిగింది. శ్రీకృష్ణుని చల్లని మనస్సులాంటి వెన్నెలలో రాధ మెల్లగా వచ్చింది. ఆమె విరహిణి. పులకితమైన సర్వప్రకృతికి మరోరూపంలా వుంది రాధ. ఆమె ఆనందానికి హద్దులు లేవు. కృష్ణుడి కోసరం సర్వాన్నీ వదిలివచ్చింది. తను ఇంత కష్టపడి వచ్చాక కాని విఫలమనోరథురాలనైనానని తెలిసికోలేకపోయింది. పువ్వు పువ్వునీ శ్రీకృష్ణుని జాడగురించి అడిగింది. 'నల్లనివాడు, పద్మనయనంబులవాడు, మౌళిపరిసర్పిత పింఛమువాడు, నవ్వు రాజిల్లెడు మోము వాడు, ఓ మల్లియరాలా! మి పొదల మాటున లేడుగదమ్మ' అని వేడుకుంది. కాని ఆ మల్లెలు కృష్ణునికన్న రాతిగుండె కలవి.

మెదలకుండా వూరుకున్నాయి.


మళ్ళీ వేణుగానం వినిపించింది.

ఆయన నిర్గుణుడు. త్రిలోక మోహనుడు. ఈ వేణురావపు పీవనలచేత రాధ గుండెల్లో విరహాగ్ని ప్రజ్వరిల్లి, ఆమెను దహించివేస్తున్నది. ఇక నిలువలేక వేణుగానం వచ్చేవైపుగా తిరిగి:

ప్రణత దేహినాం
పాపకర్మనం
శ్రీ నికేతనం
ఫణిఫణార్పితం
తే పదాంబుజం
కృణుకు చేషువః
కృంధి హృచ్ఛయం
ప్రణత కామదం
పద్మజార్చితం
ధరణి మండపం
ధ్యేయ మాపది
చరణ పంకజం
శంతమలచతే
రమణనఃస్తనే
స్వర్పయాధివాసి

అంది. అప్పటికి కృష్ణుడు చలించలేదు.

అరుణ


STUDIO Kelhā

సర్వ సృష్టిలోని ప్రతి అణువు తానే అయి వూరుకున్నాడు.

క్షణం వేణుగానం ఆగిపోయి తిరిగి మొదలైంది. లలిత లవంగ లతానికుం జాలు ఈ గానప్రవాహానికి తన్మయ త్వంతో తల లూగిస్తున్నాయి.

రాధ దేవతామూర్తిలా వుంది. విశ్వద్ధి వేదికపైన ఆమె చిరుపదాల కింకిణీరవ ములు నాట్యం చేస్తున్నాయి. రాధ దిగు లుగా చూసింది. పాపం! శ్రీ కృష్ణునితో గడిపిన గడియ లన్నీ గుర్తుకు వచ్చి నయి. కళ్ళనీళ్ళ పర్యంతం అయింది. ఇప్పటికే వెదికి వెదికి అలసిపోయింది. ఆమె ఆశలు కూడ అలసిపోయినయి. ఇక అడుగు ముందుకు పడదు. దానికి తోడు ఈ వెన్నెల మరింత బాధపెడు తున్నది. ఇప్పు డది విషంతో సమా నంగా వుంది. ఈ వియోగం ఆమెను కృంగదీసింది. ఆమె ముఖం వాడిన పుష్ప మైంది. దిగులు ఎక్కువైంది. ఆమె తల బరువుచేత వాలిపోయింది. ఆమె కనుబొమ్మలు మన్మథుని ధనుస్సులా వొంగిపోయింది.

రాధ నిమీలిత దృష్టితో వేణుగానం వచ్చే వైపుకే చూస్తూ నిల్చుంది. మురళీ రవం వినిపించిన చోటునల్లా పరుగు పరుగున పోయి వెదికింది.

ఆమెకు కోపము, విసుగు కలిగాయి. ఈ కృష్ణుడు కఠినుడు. ఇలా రాత్రల్లా వెదికినా కనిపించడు. 'కథిత సమయేపి హరి రహహ! నయయౌవనం మమ విఫల మిద మమల రూపమపి యౌవనం యామిహే! కమిహ శరణం—'

రాధ విప్రలబ్ధ అయింది. ఆమె ముఖం మీద విషాదచ్ఛాయలు అలుము కున్నయి. ఆమె అడుగులు బరువుగా పడుతున్నయి. ఆమె కాలిగజ్జెలు ఉండుండి ఘల్లుఘల్లుమని ఎగిరెగిరి పడు తున్నయి. మురళీ రవము వినిపిస్తునే వుంది. రాధ కాలిగజ్జెలు ఆ రవమునకు అనుగుణంగా తాళం వేస్తున్నయి. రాధ మనస్సులో, ఆత్మలో ఆ రవం—

"వదసియదికించి దపి దంతరుచి కౌముదీ
హరతి దర తిమిర మతి ఘోరమ్
స్ఫుర దధరశీధవే తవ వదనచంద్రమా
రోచయతు లోచన చకోరమ్
ప్రియే! చారుశీలే! ప్రియే చారుశీలే!"

అన్నట్లు వినిపించింది. మురళీ రవం... పువ్వులా ఆమె ముఖం వికసించింది. మురళీరవం అంతకంతకు దగ్గరైంది. చెంపకు రెండు చేతులు చేర్చి, పరవ శించిపోతూ ఆ రవాన్ని వింటున్నది ప్రకృతి. రాధ ముగ్ధయై పరాధీన చిత్తయై నిలిచిపోయింది! ఇంకా కృష్ణుడు రాలేదు. రాధ సంతాపం ఎక్కు వైంది; ఖండిత అయింది. తెరపడింది!

కల్పనమూర్తి ఆత్రంగా అనిమిష నేత్రుడై చూస్తున్నాడు. ఇది నాట్యమా? రాధ నిజంగా రాధలాగే వుంది. ఈ

నాట్యప్రదర్శనకు వచ్చినందుకు కల్పన మూర్తి నిజంగా అదృష్టవంతుడు."

ఎప్పుడో సంవత్సరం క్రిందట రాధ ప్రదర్శించిన రాసలీల చూశాడు. సహజంగా కళాభిజ్ఞుడు అయిన అతని మనస్సులో ఆ దృశ్యం శాశ్వతంగా ముద్రించుకుపోయింది!

అఙ్గనా మఙ్గనా మన్తరే మాధవో
మాధవం మాధవం చాన్తరేణాఙ్గనా
ఇత్థమా కల్పితే మణ్డలే మధ్యగః
సంజగౌ వేణునాం దేవకీ నన్దనః

కృష్ణుని పరివేష్టించి వలయాకారంగా ఆనాడు ప్రదర్శించిన రాసలీలని తలుచుకున్నప్పుడు కల్పనమూర్తి మనస్సు ఉప్పొంగుతుంది. ఆనాడు అతని గుండెల్లో చేరి, దాని లోతుల్ని వెదుక్కో సాగిన ఒకే ఒక ఆశయం, లేదా కోరిక తీరుతుం దనే నమ్మకం కలిగింది. రోజు రోజుకీ, నిమిష నిమిషానికీ ఆ కోరిక బలంగా పెరుగుతూ వచ్చింది. ఏమైనా తానొక మహత్తర చిత్రం వేయాలి.

అదే, ఎప్పుడో చిన్నప్పుడు సుఖము దుఃఖము ఏవీ తెలియని రోజుల్లో పక్కింటి సరస్వతి శ్రావ్యంగా చదివే 'అఙ్గనా మఙ్గనా...'

విన్నప్పుడల్లా అతనిలో భావాలు విజృంభించేవి. ఆ ఊహాజగత్తు అనంతమైనది. యమునానది తరంగాల్లాంటివి ఆభావాలు. అందులో తనే కృష్ణుడు. తనలోనుండి అనేకరూపాలు విడివడి అంగనకు అంగనకు మధ్య నిలిచి నృత్యం చేసినట్లే అనిపించేది. ఆ సన్నివేశమే, ఆ మనోజ్ఞ దృశ్యమే శాశ్వతం చేయగలిగితే! చేయగలడా? ఏమైనా ఈ ఆశను మాత్రం వదులుకోలేడు. అతని హృదయపు పెదారిలో ఈ ఆశ ఒయాసిస్సు అయింది. అతని మనస్సు నాట్యోన్మత్తమై పోయేది ఇటువంటి సమయములోనే? బాహ్య ప్రపంచపు సరిహద్దులు దాటి రూపాతీతమైన మరోస్థితికి చేరుకునే వాడు. ఈ దివ్యానుభూతి తరుచుగా కలుగుతూండటం పరిపాటి అయ్యింది. ఒకేఒక ఆశయం! దీన్ని చిత్రంగా వేయాలని. ఈ అనుభూతికోసరమే సరస్వతి దగ్గరకు పోయి "అక్కా, మళ్ళీ చదువు" అంటూ ఆ శ్లోకాలు చదివించుకునేవాడు.

చిన్నతనంలోనే తల్లితండ్రి చనిపోయినప్పుడు కల్పనమూర్తి అంతబాధ పడలేదు. మేనమామ పెంచి చదువూ సంధ్యా ఏమీ చెప్పించకుండా సగం ఆస్తి కాజేసి "ఇదిగో మిగిలింది ఇదే" అని ఇల్లు, నాలుగెకరాలు చేతిలో పెట్టినప్పుడు కల్పనమూర్తి బాధపడలేదు. అతని కళాత్మక హృదయం అంత బాధ భరించింది. అసలు ఆ బలమైన కోరిక ముందు ఇవన్నీ తృణప్రాయాలై నిలిచినయి.

లీలాశుకుని మధుర భావాలకు తను రూపకల్పన చేయాలి. ప్రాణప్రతిష్ఠ

చెయ్యాలి. ఆ చిత్రాలలో జీవరేఖలు అంత శ్లీనంగా ప్రవహించాలి. లీలాశుకుని హృదయంలోని అమృత ప్రవాహంలో ఏ ప్రకృతి పురుషులు రాసలీల జరిపారో ఆ ప్రకృతి పురుషులే తన హృదయవేదిక పైన నాట్యం చేయాలి! వర్ణాల ఇంద్రజాలంలో సమ్మోహనమై, తన జీవితం తరించాలి. జీవితం పరిమిత మైంది. ఆ పరిమిత మైన జీవితం తనకు ప్రసాదించిన వరం సామాన్యమైనదికాదు. ఆ కళారాధనలో ఆ సుషుమ్నలో తను అమరత్వాన్ని పొందాలి! ఎందుకు పొందడు? ప్రేమ లోని ఆనందమేగా ఈ చిత్రకళ; ఇదే వేదన జాగ్రదావస్థలోను, సుషుమ్నలోను అతని హృదయంలో:

కేకి కేకా దృతానేక పంకేరుహా
లీనహంసావళీ హృద్యతా
కలిస వంశాటావీ దాహదవానలః
సంజగౌ వేణుకా దేవకీనందనః


అంటూ మారుమ్రోగుతునే వుంది. ఆ భగ్నతపస్విని రాధ తన కళ్ళముందు జగత్తును పరవశింపచేస్తూ, తను పరవశించిపోతూ మురళీరవం వస్తున్నదిక్కుగా సాగిపోతున్నట్లె కవిపిస్తుంది. ఈ పవిత్ర భావన అతను పుట్టకముందు నుండి అత నిలో, లీనమైపోయిందేమో? కృష్ణుని కళ్ళల్లో, చూపుల్లో తృష్ణ, రాధ అలసిన ముఖంలో ప్రసన్నత, అంతరాంతరా లలో కృష్ణుని కట్టేసుకోవాలని వేదన — ఇవన్నీ చిత్రించగలిగితే? ఆ రాధా కృష్ణుల ప్రణయతత్వానికి రూపకల్పన చేయాలి అఒక్క చిత్రమే చాలు. అసలు తనిక్కడ ఎందుకు జన్మించాడు? ఆ బృందావనంలో తనూ ఒకగోపబాలకుడై జన్మించకూడదూ? యమునాతీర సైకత సీమలలో 'కృష్ణా, కృష్ణా' అంటూ రాధ లాగే వెదికేవాడు. సమస్త ప్రపంచాన్ని మోహింపచేసే కృష్ణుని దివ్య సౌందర్య సుధారసాన్ని తనివార గ్రోలేవాడు. తనూ అభిసారిక అయి తనలో స్త్రీత్వం నింపు కునేవాడు.

ఈ కోరిక మృగతృష్ణలోని నీటి కోసం పరుగెత్తటం వంటిదేనా? అదే అయితే? అతను భయంతో వణికిపో యాడు. అప్రయత్నంగా అతని కన్నుల వెంబడి రెండు నీటిబొట్లు రాలినయి. ఈ నిరాశని కలలోకూడా ఊహించ లేడు; భరించలేడు. ఆవేదనయొక్క తీవ్రత అంత ఎక్కువైనది.

ఆనందస్వరూపమైనది కళ. ఆ మహా నందంతో మునిగిపోయి ప్రేమ నిర్వా ణము పొందటం ఎంత అదృష్టం! ఆ మరణం ఎంత అందంగా వుంటుంది? యుగయుగాల ఘోర తపస్సుకు ఇదే గమ్యస్థానం.

ఈ ఆశతోనే ఇక్కడికి వచ్చాడు.

ఆలోచనలతో ఎంతసేపు ఉన్నాడో అతనికే తెలియదు. కళ్ళుతెరిచి చూసేసరికి దాదాపు అన్ని కుర్చీలు ఖాళీ అయినయి.




అత నొక్కడే మిగిలిపోయినాడు. చుట్టూ చూసి మెల్లగా గ్రీన్ రూం వైపు దారి తీశాడు!

## 2

"నమస్కారం."

గజ్జెలు విప్పుకుంటున్న రాధ తలెత్తి చూసింది.

"నమస్కారం" అంది తిరిగి కల్పన మూర్తిని చూసి.

"మీ నాట్యం చాలా బాగుంది."

"థాంక్స్." అంటూ తన పనిలో నిమగ్నురా లైంది.

"నేను మీ కో ముఖ్యమైన పనిమీద వచ్చాను." అన్నాడు రెండు నిమిషా లాగి.

ఈసారి ఆశ్చర్యపోయే వంతు రాధ దైంది. "ఏమిటి?"

"నాకు మీ సహాయం కావాలి." అన్నాడు ముందుకు వొంగి.

"సహాయమా?"

"రాధాదేవీ! మీ కంతా విపులంగా చెబుతాను వినండి. నా పేరు కల్పన మూర్తి. చిత్రకారుడ్ని."

కల్పనమూర్తి ఆమె ముఖంలో భావాలు గమనిస్తూ ఆగాడు.

"చెప్పండి" అంది చిరునవ్వుతో.

ఆ నవ్వు అతనిలో ఆశాదీపాల్ని వెలిగించింది.

"నా ఆశ మీ వల్లనే నెరవేరాలి." అన్నాడు ఉత్సాహంతో.

"ఏమి టది?"

"ఈ రోజు మీ నాట్యం చూసాను. ఆ రాధా కృష్ణుల ప్రణయ తత్వాన్ని

వాలుగైదు చిత్రాలలో ప్రదర్శించా లని నాకు కోరికగా వుంది. అది నా ఆశయం; అది నా జీవితానికి ధ్యేయం. వా టి ని ప్రకృతి కంకిత మివ్వాలని—"

"దీనికి నే నేం చేయగలను?"

"మీరు రాధగా నా చిత్రాలలో ఇమిడిపోవాలి"

"మీకు మోడల్‌గానా?" అంది ఆలో చిస్తూ.

కల్పనమూర్తి ఔనన్నట్లుగా తలూపాడు.

రాధ ఒక్క_క్షణం మాట్లాడలేదు.

రాధ మౌనాన్ని చూసి కల్పనమూర్తే అందుకున్నాడు "మీ కిందుకు నే నేమి ప్రతిఫలం ఇవ్వలేకపోవచ్చు కాని కేవలం ఒక కళాకారుడుగా నామీద దయ తలవమని నా ప్రార్థన" అన్నాడు

"నా కేమి అభ్యంతరం లేదు కాని ఇంకా నావి ఆయిదారు ప్రోగ్రామ్స్ వున్నాయి."

కల్పనమూర్తి ముఖంలో కాంతి ఆరిపోయింది. ఇంతదాకా వెలిగిన ఆశాజ్యోతి ఆరిపోయింది. రాధ రాలేదు ఇక ఆ చిత్రాలు ఎలా వేయగలడు?

"అంతేనా రాధాదేవీ?" అన్నాడు నిరాశగా.

"మీరే ఆలోచించండి." అంది భారాన్నతనిమీదకే నెట్టివేస్తూ.

"అంతేలేండి! నాకు ఆ దివ్యానుభూతులు కలగాలంటే మీ సహకారం అవసరం. కాని మీ రేం చేస్తారు? నేనే దురదృష్టవంతుడ్ని." అన్నాడు

రాధ నిట్టూర్చింది. ఆమె అదివరకే కల్పనమూర్తి పేరు విన్నది. ఒకసారి ఎగ్జిబిషన్‌లో అతని చిత్రం 'ఛాయామూర్తులు' చూసింది. అది ఆమెను విశేషంగా ఆకర్షించింది. ఇంకా ఆ చిత్రం ఆమె కన్నులలో మెదులుతూనే వుంది. దాన్ని కొందామని ఎంత ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది.

ఆమె గుండెలో వేలప్రశ్నలు ఉదయించినయి.

ఆ కల్పనమూర్తి ఇతనేనా? ఇతనేనా?

రాధ తలెత్తి చూసేసరికి కల్పనమూర్తి వెళ్ళిపోవటానికి సిద్ధపడుతున్నాడు.

"వెళ్ళిపోతున్నారేం?" అంది ఆశ్చర్యంగా.

"ఏం చేయను? మీకు వీలుపడదన్నారుగా. ఇక్క_డుండి మిమ్మల్ని బాధపెట్టటము నా కిష్టంలేదు." అన్నాడు. అతని కంఠం బాష్పావరుద్ధమైంది.

రాధ ఒక్క_క్షణం ఆగి "ఛాయామూర్తులు వేసింది మీరేకదూ?" అంది.

కల్పనమూర్తి తల ఊపి "అవును. ఏం?" అన్నాడు.

"ఏంలేదు. ఎప్పుడో ఒకసారి చూసినట్లు గుర్తు."

అతని కేం మాట్లాడాలో తోచలేదు. ఆమె ముఖంవంక చూసి వూరుకున్నాడు.


"సరే, మీకు మోడల్‌గా వుండటానికి సిద్ధమే."

"మీ మిగిలిన ప్రోగ్రామ్స్?" అన్నాడు ఆమె ముఖంలోకి చూస్తూ.

"దానికేం రద్దు చేసుకుంటాను నే నేం డబ్బుకోసరం నాట్యం చేయటం లేదుగా. కేవలం నా మానసిక సంతృప్తి కోసరం."

"చాలా కృతజ్ఞుడ్ని."

అతని ముఖంలో ఆనందజ్యోత్స్న వెల్లివెరిసింది.



## 3

కల్పనమూర్తి తదేకంగా చూస్తున్నాడు. యాంత్రికంగా చేతిలోని మధూలిక కదులుతోంది.

ఆమె రాధ; విరహిణి!

శిరస్సున నెమిలిపింఛమే అలంకారముగా గలవాడు, సామాన్యులు గ్రహించలేని శృంగారమాల రాశియైన కృష్ణుని తేజోరూపాన్ని తలుచుకోగానే ఆమెకు శరీరం జలదరించింది. కృష్ణుడు తేజోమయమైన చైతన్యమైన పదార్థం. అది అంతులేనిది. ఆ తేజస్వరూపానికి ఇంకా అలంకారము లెందుకు? అందముకన్న అందమైనవాడు కృష్ణుడు. ఆ అందము ఆమె మనస్సును హరించివేస్తున్నది ఆ చిరునవ్వు ఆమె విరహాన్ని విజృంభింపచేస్తున్నది. 'వేణు' గానానికి

మూలము బ్రహ్మము. కాబట్టి విచిత్ర మధురస్వరముల సృజించుచు ఆ గాన ప్రవాహంలో చిక్కిన వ్రజవనితలు బిగ్గరగా కౌగలించికొనగా అప్పుడు అంటుకున్న వారికుచకుంకుమపు కాంతితో కూడిన దేహచ్ఛాయ కలిగి వెలిగే కృష్ణ తేజస్సు ఆమె కన్నులలో మెదిలింది. ఆదే ఆమెకు ప్రాణమైంది. ఆ ప్రాణానికి ధ్వని అయింది. ఆమె మనస్సు అర్థమైంది. ఆ మనోచిత్రానికి లయ అయింది.

యమునాతీరమందు పుట్టిన ఆ వంశీనాళం కృష్ణుని కెమ్మోవి పొంతం చేరుట వలన ఎంత ధన్యత నొందిందో? ఎన్ని జన్మలకైనా ఆ కృష్ణుని అధర సుధారస పానాన్ని ఆస్వాదించగల భాగ్య మబ్బుతుందా?

ఈ ఆశతోనే ఆ రవము వినిపిస్తున్న దిక్కుగా పోయింది. కాని ఆ ఆశ నిరాశ అయింది. అక్కడ కృష్ణుని చూడగానే నిర్ఘాంతపోయింది. తనతో 'ఈ పొదరింటలో నిలువ'మని చెప్పి ఇక్కడ గోపకాంతలతో సరసాలాడుతూ కూర్చున్నాడు. ఒక గోపకాంత తల కృష్ణుని వొడిలో వుంది. ఒకగోపకాంత కృష్ణుని మెడను కౌగలించుకుంది. ఒకతె ఆయన పాదాలపై తలపెట్టి పడుకుంది. రాధ గజగజ వొణికిపోయింది. ఆమె కళ్ళ నుండి నిప్పులు రాలాయి కోపంతో. కన్నీరు వచ్చింది. అవమానంచేత తల వాలిపోయింది. ముఖం వెలవెలబోయింది, రాధని చూసాడు కృష్ణుడు. తప్పు బయటపడింది. రాధస్థితి ఎలావుందో కృష్ణుడి స్థితికూడ అలావుంది. రాధవంక చూడలేకపోయాడు.

ఈ భావాన్ని నిలపాలంటే రాధకు కష్టంగానే వుంది. కాని అతనికోసరం శ్రమపడటానికే నిర్ణయించుకుంది.

కల్పనమూర్తి కివేమి పట్టలేదు. అతను మహానందంలో తేలిపోతున్నాడు అతన్ని ఇంతవరకు భగవంతు డాశీర్వదిస్తూనే వచ్చాడు. ఆ దివ్యానుభూతులు కలుగుతూనే వున్నయి. ఎదురుగా అర్ధ నిమీలిత దృష్టితో రాధ ఇది చాలు. ఇదొక స్వాప్నిక జగత్తు.

కేవలం వస్తుస్వరూపమే కాక, భావానికి ఎక్కువ ప్రాముఖ్య మిస్తాడు కల్పనమూర్తి. అతని చేతిలో మధూలిక రాధ కనుగుణంగా నృత్యం చేస్తున్నది. రంగు కాన్వాస్‌మీద ప్రాణప్రతిష్ఠ చేసికునేవి. అశాశ్వతమైన ఆ రంగులు శాశ్వతమై కృష్ణ తేజస్సుతో వెలిగిపోయేవి. ఆ తేజస్సు వాటిలో ప్రాణం పోసేది. చరాచరాలలోని చైతన్యం అతని రంగులమధ్య బంధింపబడేది అలనొక మహాజ్యోతిలా వెలిగిపోయేవాడు. ఆమె తొలి ప్రత్యూషంలా అందంగా వుండేది. సౌందర్యోపాసన కళ. రసానందమే కళాయుక్తపరికల్పం. ఈ రసతృష్ణే సర్వజగత్తును సౌందర్యమ

యం చేస్తున్నది. ఆసౌందర్యమే అతనికి మానసిక శాంతిని చేకూరుస్తున్నది. ఆ సౌందర్యమే అతనికి దృష్టిలో సత్యం. వీటి అద్వైతం శాశ్వతమైనది. ఆ ఆనందము సామాన్యమైనది కాదు. అజ్ఞానం నుండి జ్ఞానానికి, చీకటి నుండి వెలుగుకి తీసికుని పోయే దీ శక్తే. ఈ సౌందర్యోపాసనమే. ఈ ఆనందమే. ఆ శక్తే సౌందర్య సంయుక్తమైన సత్యం.

భావోద్రేకంలో వేసిన రంగులు లయాత్మక మైనవి. అతన్ని మహాలయ స్థితికి తీసికు పోయినయి. ఆనందంలో ఈ చిత్రం జన్మించింది. ప్రతిరేఖా ఆ పరిపూర్ణతతో నిండిపోయింది. ప్రేమ ఈ భావ చైతన్యం యొక్క సమగ్ర స్వరూపం. ఇది ఊహా సముద్రం లోంచి కొట్టుకురాలేవన్నది నగ్నసత్యం ఇదే సృష్టికి బీజమైంది అతని ముఖం ఈ భావకాంతికి ప్రజ్వరిల్లింది. దీనికి అంతం లేదు. చిత్రకారుని ఆనందం యొక్క ప్రతిరూపమే ఈ చిత్రం. ఒక విధమైన లయతో ప్రాణం పోసుకున్నయి ఈ చిత్రాలు

ఇది వేదన. నిద్రాహారాలు కూడ మాని ఈ సాధనలో మైమరచిపోయే వాడు. బాహ్య ప్రపంచం ఏ మాత్రం తెలిసేదికాదు. ఈ ఆనందానికి వ్యతిరేకత లేదు. సర్వాన్నీ అది రసమయం చేస్తున్నది. అతని కళ్ళ ఎదుట సమస్త సృష్టి రహస్యాన్నీ సాక్షాత్కరింప చేసింది. నవనవోన్మేషమైన శక్తిని ప్రసాదించింది అతనికి. ఆ సమాధిభంగం లేదు. ఈ సమాధి శాశ్వతమైతే. అమరత్వం చెయి చాపితే అందుతుంది. అందుకు సందేహం లేదు. ఆ మహాప్రస్థానానికి దగ్గరదోవ ఏర్పడుతుంది. అంతరంగికమైన మరో జగత్తు సృష్టింపబడుతుంది. అది వాస్తవమైనది. అది సత్యముయొక్క అనుభూతితో కూడుకుంది. ప్రేమ ఆనందమయమై తనంతతానుగా ఈ నూతన జగత్తులో విడివడి పోయి రహస్యాన్ని బయటపెట్టుతుంది. సర్వ ప్రపంచంలోనూ నిండిపోయినది ఈ ఆనందమే! ఇది భౌతికమైన సుఖాలను దాటి ఊహాతీతమైన మనో పవిత్ర భావవాహినియైంది. అతని మనస్సు దీపాలు వెలిగిన కోవెలఅయింది. సమస్త జడత్వము కాలువలై ప్రవహించి ఈ శక్తిలో లీనమైపోతున్నట్లు అనుభూతి. ఈ సాధన ఆత్మోన్నతికి ఉపకరించింది. అది సమగ్రమైన ప్రేమ యొక్క సాక్షాత్కారం. ఈ జ్యోతే అతని ఆత్మను బహిరంగపరిచింది. ఎప్పుడు? ఈ మహా దివ్యానుభూతికి ఫలితమెప్పుడు? జీవితంలోనూ మహాసౌందర్యంలోనూ వైవిధ్యం పొందిన తొలిప్రత్యూషం ఈ స్థితి. సానుభూతి క్షణక్షణంలో, ప్రతి అంగములో జీర్ణించుకుపోయింది. అఖిలాత్మచైతన్యం పరమాత్మకై పెట్టిఆక్రోశం. ఈ విధంగా ఆత్మ, పరమాత్మల సంబంధం ఎక్కు

పైన కొద్దీ అతను చిత్రాలను అద్భుతంగా వేశాడు. ఆచిత్రాలలో రూపాలు, రంగులు ఆద్భుతంగా పరిణితి నొందినయి. అవి భాష కందని మానసిక పరిణామపు ప్రతిరూపాలు.

## 4

ఈరోజు మనస్సదోలావుంది. అతని గుండెల్లో భయంకరమైన తుపాను రేగుతున్నది. అతని కళాజీవితం కెరటంలా విరుచుకుపడుతున్నది అగ్ని పర్వతాలు బ్రద్దలవుతున్నాయి

రెండు చిత్రాలు పూర్తయినాయి ఇంతవరకు ఈ సృష్టిని గురించిన గర్వమేనా? సంతృప్తేనా? కాదు. ఇది స్వల్పమైనది. ఇంతకన్నా కావలసింది. మరొకటి వుంది. బరువుగా కళ్ళెత్తి వేస్తున్న చిత్రంవంక చూశాడు.

శ్లిష్యతి కుమపి చుంబతి కామపి
రమయతి కామపి రామాం
పశ్యతి సస్మిత చారుతరా
మపరా మనుగచ్ఛతి రామామ్

ఆ సమయంలో రాధ వెళ్ళింది. ఆమె మనస్సు జలదరించింది. ఆమె అధరాలు కంపించినయి. ఆమె మనస్సులా కాలిగజ్జెలు ఎగిరెగిరి పడినయి. క్రిందటి రాత్రేగా 'సాధుత్వ ద్వదనం సుధామయ' అని చుంబించాడు. కాని ఇప్పుడు ఆ మాట లన్నీ మరిచిపోయాడు!

అతని చేతిలోని కుంచె జారిపోయింది. అతని కనుల ముందు ఆ చిత్రం అదృశ్యమై ఆస్థానంలో రాధ నిలిచింది.

"రా—ధా!" అన్నాడు అప్రయత్నంగా.

ఏమిటో ఆవేశం! భౌతికానికి ఆధ్యాత్మికానికి సంఘర్షణ జరుగుతున్నది. తను ఓడిపోతున్నాడా?

ఎందుకో ఈరోజు మనస్సు బాహ్య సౌందర్యము మీదికి పరుగెత్తుతోంది అశాశ్వతమైన దని తెలిసి కూడ మనస్సునెందుకు జయించలేక పోతున్నాడు.

రాధ వస్తున్నది! ఆమె కాలిగజ్జెల మ్రోత సమ్మోహనస్వ పూరిత మయి. వేణు నినాద సంశ్లిష్టమై మనస్సు నావరించింది.

శరీరమంతా స్వేదబిందువుల మయమై పోయింది. నరనరాలు విద్యుద్ఘాతం తగిలినట్లు కంపిస్తున్నది.

"ఆగు రాధా! రాకు" మనస్సుతో బిగ్గరగా అరిచాడు కాని మాట బయటకు రాలేదు. ఫలితంగా దుఃఖం మాత్రం వచ్చింది. రెండరచేతుల్లోను ముఖం దాచుకుని బాపురుమన్నాడు. పెనుగాలికి వూగిపోయే లతలా వూగిపోయాడు. పారిపోవాలి! ఇక్కడనుండి పారిపోవాలి ఈ మహా భయంకర అపవిత్ర భావనకి దూరంగా, దూరదూరంగా పరుగెత్తాలి. జీవిత పరిభ్రమణమే అలాంటిది.

అశాశ్వతాన్ని శాశ్వతం చేస్తున్నదేమిటి?

అతనిలోని జీవశక్తు లన్నీ కర్పూ



రంలా హరించుకుపోయినవి. భరించ లేని నీరసంతో కూలిపోయాడు

"మూర్తిగారూ," అంటూ వచ్చింది రాధ.

కన్నీటి తెరలోంచి ఆమె ఆగమనాన్ని చూశాడు

"ఆదేమిటండీ అలా వున్నారు?"

కల్పనమూర్తి జవాబు చెప్పలేక పోయాడు. అతని మనస్సు విజృంభించింది. తల తిరిగి పోయింది. దివి భువి అంచులతో ఏకీభవించినట్లు కన్నీటిరెప్పలు మూసుకొన్నాయి. బలంగా సర్వజగత్తు చీకటిమయమై కన్నీటి బిందువుగుండా జారిపోయింది.

"మూర్తిగారు!"

దగ్గరగా వచ్చింది అతని హృదయంలోనూ చిరుతగజ్జెలు నృత్యంచేశాయి.

"అలా వున్నారేం? ఒంట్లో బాగా లేదా?"

ఒళ్ళు తాకి చూసింది. విద్యుద్ఘాతం మరోసారి తగిలింది.

"రా.. ధా!" అన్నాడు. కంపిస్తున్న గొంతుతో.

ఇక లాభం లేదు. ఈ కోరికను జయించలేదు.

"మూర్తిగారూ"!అంది ఆశ్చర్యంగా. ఇన్నిరోజుల సహచర్యంలోనూ అతన్ని ఇంత హీనస్థితిలో ఈ రోజే చూసింది. ఏనాడూ ఇలా బాధపడలేదు. అంతటి గొప్ప కళాకారుడికి తోడ్పడ కలిగినందుకు రాధ నిజంగా సంతోషించింది. పూర్తయిన రెండు చిత్రాలలో అతను ప్రాణ ప్రతిష్ట చేసిన రాధా ప్రణయ తత్వానికి జోహరు లర్పించకుండా వుండలేక పోయింది. రాధలో ఎన్ని భావాలు? ఎన్ని రంగుల మేళవింపులు. ఒకప్రక్క కృష్ణుడు వస్తాడనే ఆశా; మరో ప్రక్క రాలేదని బాధా; మురళీరవము విని తన్మయత్వము; ఇతర గోపకాంతలతో కృష్ణుని తలచుకుని అసూయ...ఇవన్నీ చిత్రించాడు. ఆ గీతల్లో సంగీత ముంది. ఇంత శక్తి ఎవరి కుంది? కాని ఈ రోజు ఎందు కిలా నిరాశా, నిస్పృహలతో పారిపోయాడు? ఏమిటి కారణం?

"కల్పనమూర్తిగారూ!" అంటూ అతన్ని లేవదీసింది. పమిట చెంగుతో ముఖం తుడిచింది ఫ్లాస్కులోని కాఫీ పోసి నోటిదగ్గర పెట్టి "త్రాగండి" అంది

ఈ సానుభూతికి విలువ ఎక్కువ. ఇందులో నీరసానుభూతి వుంది. ఈ ఓదార్పును భరించలేకపోయాడు. చప్పున చేయి పట్టుకుని "రాధా!" అన్నాడు వగరుస్తూ.

రాధ నిర్ఘాంతపోయింది. హఠాత్తుగా నోరు మూగబోయింది.

క్షణంసేపు విశృఙ్ఖలదీపం వెలిగింది.

"రాధా, నీ హృదయం విప్పి చెప్పు. నన్నుగురించి నీ అభిప్రాయ మేమిటి?" అన్నాడు దీనంగా. రాధ నవ్వింది.

"ఉత్తమ కళాకారులు. మీ జీవితం ఉత్కృష్టమైనది మీ జీవితమే ఒక మహత్తర కళాఖండం!"

"అంతేనా?"

"అంతకంటే ఏముంటుంది?"

"నా మీద నీ కేమీ___"

రాధ తలవంచుకుంది.

"నేను మళ్ళీ వస్తాను. మీ మూడ్ సరిగాలేదు." అంది వెళ్ళబోతూ. కల్పనమూర్తి ద్వారానికి అడ్డుగా నిలబడి "జవాబు చెప్పు రాధా!" అన్నాడు గాద్గదికంగా.

"ఏం చెప్పను ఇలా అడిగితే? మీ ప్రశ్నకు జవాబు నా దగ్గర కన్న మీ దగ్గరే వుంది."

"అయినా సరే నీవే చెప్పు. నా దగ్గరున్న జవాబుని వెదుక్కోగల శక్తి నాకు లేదు."

"మీరు భ్రాంతిలో పడుతున్నారు మీ ఆశయం మరిచిపోయారా?"

"లేదు. అందుకే బాధపడుతున్నాను

ఏమైనా ఈ ఇహమ౦దే ఆ అముష్మి కాన్ని సాధించగల నని అనుభవంమీద తెలుసుకున్నాను."

రాధ మౌనంగా వూరుకుంది.

"నా సౌందర్యోపాసనకి శక్తి ప్రదాయినివి నీవు. నా కళారాధనలో అంతర్భాగానివి నీవు. నా మనస్సు గ్రహించకపోవు. నా జీవితానికి, నా సృష్టికి ఆది మధ్యాంతాలు అన్నీ నీవే. నీవు లేకపోతే నేను జీవించలేను. ఈ చిత్ర రచన అసంపూర్తిగా మిగిలిపో తుంది. రాధా, నాకు పునర్జన్మని ప్రసా దించు. నా కళోపాసనకి అంతం ప్రసా దించకు. నా జీవితంలో అంతర్భాగాని వైపో. నా ఆత్మకి ఆత్మకా. నా నుంచి దూరంకాకు," అన్నాడు ఆవేశంతో

"ఏమి టిది? ఎవరైనా చూస్తే—"

"నా ఇన్నాళ్ళ అన్వేషణకి మూలం నీవు ఇక 'నా' 'నీ' భేద మేముంది? ఎవరైనా చూస్తేమటు కేం?"

"ఇది మిథ్య."

"నా కిదే సత్యం."

"మూర్తిగారు!"

"ఇది బుద్బుదమని తెలుసు అయినా ఈ క్షణాన్ని శాశ్వతం చేయగల శక్తి నీకుంది. నీ విలువ నీకు అర్థంకాదు."

రాధ నిట్టూర్చింది.

"మాట్లాడవేం రాధా?"

"నన్ను కాస్త ఆలోచించుకో నివ్వండి. ఇది జీవన జాగృతికి సంబం ధించిన ప్రశ్న." అంది వెళ్ళబోతూ.

ఈ మాటతో అతను బలహీనుడై నాడు అడ్డుతొలగి "వెళ్ళు" అన్నాడు.

రాధ వెళ్ళిపోతున్నది. వీధివాకిలి కూడ దాటింది. కల్పనమూర్తి వాకిట్లోకి వచ్చి పారిజాతవృక్షంక్రింద నిలబడ్డాడు.

రాధ తలవొంచుకుని వెళ్ళిపోతోంది.

"ఓ స్త్రీ, ఎవరునీవు? నా కళా రంగం లోకి ఎందుకు ప్రవేశించావు? నాలో ఈ వ్యధ నెందుకు కలిగించావు? ఇప్పుడు నీ దోవన నీవు పోతున్నావు! ఊరికేకాదు— నా బాధల్ని, బరువుల్ని, అనుభవాల్ని, ఆవేదనని మోసుకు పోతున్నావు. నే నిక్కడ ఒంటరిగా ఈ పారిజాతపు వృక్షముక్రింద నిలబడిపోతాను. ఇక ఇక్కడ్నించే నా నిరీక్షణ ప్రారంభం ఔతుంది. ఈ చక్రభ్రమణం ఎంత విచి త్రంగా మొదలైందో అంత విచిత్రం గానూ ముగుస్తుంది గాలి వీచినప్పుడల్లా పారిజాతాలు నా చుట్టూ రాలుతాయి. శిశిర వసంతాలు నా జీవితంలోంచే దూసుకుపోతయి. దివారాత్రులు నా పైనుండే ఉదయించి అస్తమిస్తయి. అయినా నేను కదలను. ఇలా నేను ఓడి పోవటానికి బహుశా నా జీవితయవనిక మీద నా చిత్రాన్ని సరిగ్గా చిత్రించుకో లేకపోవటమే కావచ్చు. నువ్వుపోతూనే వున్నావు. నీ రూపం దృశ్యా దృశ్యంగా నాకు కనిపిస్తునే వుంది. నీ చిరుపదాల ధ్వనిని నా హృదయ శ్రవణం వింటూనే

వుంది. నీకంటే సత్యమైన, స్థిరమైన, శాశ్వతమైన, అనంతమైన, తేజోమయమైన స్త్రీ మరొకరు లేరు. నా ఆవేదనవి నువ్వు: నా అహం నువ్వు. అయినా నా వ్యధని గ్రహించలేక పోతున్నావు. నీ కోసరం నా అహం రాత్రింబవళ్ళు శ్రమపడుతునే వుంది. పుట్టినప్పటినుంచీ నీ చుట్టూ అదృశ్యంగా పరిభ్రమిస్తునే వున్నాను. ఈ జీవితంలో ఎన్నాళ్ళు వున్నాము అన్నది ముఖ్యమైన ప్రశ్న కానేకాదు. ఏమిచేశామన్నదే ముఖ్యమైన ప్రశ్న!

నేనిక చిత్రాలు వేయలేను ఈ ఇల్లు ఇలాగే శిథిలమై పోతుంది. ఆ చిత్రాలు దుమ్ము ధూళి పరిసర్పితములై పోతయి. వాటి విలువ క్రమంగా తగ్గిపోతుంది. నాకు నీవు ప్రసాదించిన దివ్యానుభూతుల విలువ మాత్రమే శాశ్వతమై వుంటుంది. కాని ఆ అనుభూతికి సరియైన ఫలితమేది? ఆ అనుభూతిని నాకు మళ్ళీ ప్రసాదించు. జ్వాలయే దీపమునకు సర్వస్వమైనట్లు ప్రణయమే జీవితపు సర్వస్వమైంది. నీకేం తెలుసు నా బాధ? దుగ్ధ బడబాగ్నితో దగ్ధమౌతున్నది హృదయం. నా జీవితం దుగ్ధపథము కాదు.

ఒకటి మాత్రం నిజం. ఇది వ్యామోహం కాదు. ఈ సంగతి నీకు బాగా తెలుసు. నీ జీవితం, నా జీవింతం భౌతికంగా మాత్రమే భిన్నమైనవి. నా ఆనందానికి మూలం నువ్వు. ఆ ఆనందంలోంచే నా కళ ఆవిర్భవించింది.

నువ్వు స్త్రీవి. కరుణామయివి ఆ కరుణలోంచే ప్రేమ జనించాలి. తప్పకుండా జనిస్తుంది. ప్రేమ దగా చేయదు. నన్ను ఆదరించేవాళ్ళు లేక తపించి తపించి దహించుకుపోతున్నాను. నా ప్రేమ అంతర్గతమై మహా వేగంతో ప్రవహించి అదృశ్యమైపోతూంది. కెరటాలలాగే నా అనంత భవిష్యత్తు దురదృష్టపు శిలలకు తగిలి ఛిన్నాభిన్నమై పడిపోతున్నయి. నా జీవితం ప్రేమించటానికి ఉద్దేశింపబడలేదేమొ! నా ఆత్మ, నీ ఆత్మ సహచర్యాన్ని కోరటంలో పొరబడిందేమో? అయినా నా గుండెల్లో వెలిగే నిన్ను నీవు గుర్తించుకో గలిగితే నీ గుండెల్లో వెలిగే నన్ను నీవు గుర్తించగలవు. నా ప్రతిబింబానివి నువ్వు రాధా! నన్ను కరుణించు నీ చిరుతపదాల కింకిణీరవములు ఎదనిండా వెదజల్లు. నీ నవ్వుల పువ్వుల హారాల్ని నా జీవితం నిండా వేయి. నాకు అస్తిత్వాన్ని ప్రసాదించు. ఈ జీవితం శూన్యం కోసరం సృష్టింప బడలేదు. దీనికి ఓ పరమార్థం వుంది. నన్ను నీవే నిర్వచించాలి! ఇది నా తొలివలపు ఛాందసం. దీన్ని బ్రద్దలు చేయకు.

కల్పనమూర్తి కళ్ళుమూసుకున్నాడు. పారిజాతాలు ఒకటొకటే అతని మీద

నుండి రాలిపోతున్నాయి. దూరంగా శకుంతాల జంటలు వెనక్కి తిరిగి గూడు చేరుకుంటున్నాయి. అతనిచుట్టూ ఆశల్లా పూలు పేరకుంటున్నాయి!

## 5

కల్పనమూర్తిని వివాహం చేసికోవడంతోగాని రాధకు తను చేసినతప్పు తెలిసిరాలేదు ఇది కేవలం తప్పు కాకపోయినా, దూరదృష్టి లేని ముందడుగు. రాధ కల్పనమూర్తిని పూర్తిగా అర్థం చేసికోలేదు. అతనిది కళామయ జీవితం. అంతే! ఆమె అతని బాహ్యజీవితాన్నే సరిగా తెలుసుకోలేకపోయింది. రాధ తనది కావటంతో కల్పనమూర్తి ఉద్రేకము కట్టలు త్రెంచుకుంది; అతని కళాత్మక హృదయం మరింత.



సూర్యుని వేడితో సమానమైన ఉద్రేకంతో చిత్రాలు వేయటం ప్రారంభించాడు. అదే సమయంలో సామాన్యమైన జీవితసూత్రాలని మరిచిపోయాడు. కాని రాధకి ధ్యేయం అది కాదు. ఆమె ఇంతకన్నా సౌఖ్యవంతమైన జీవితం కల్పనమూర్తికి ప్రసాదించాలని వచ్చింది. కాని కల్పనమూర్తి బాహ్యజీవితాన్ని తృణప్రాయంగా చూస్తూ వచ్చాడు.

రాధ ఉద్దేశ్యంలో జీవితానికి కేవలం ఆముష్మికమే కాక, ఐహికము కూడ కావాలని. దాన్నే అతను నిర్లక్ష్యం చేస్తున్నాడు. ఈ భావం అతనికి దరిద్రదేవత ప్రసాదించిన వరం కావచ్చు. రాధకు ఈ అనుభవం లేదు. ఈ దారిద్ర్యంలో వున్న దౌర్బల్యానికి ఆమె క్రమంగా లొంగిపోసాగింది. దారిద్ర్య దేవత ఆమెను తన బానిస చేసుకుంది. చీకట్లో ఏ వస్తువైనా

నల్లగా కనిపించినట్లే ఈ దారిద్ర్యంలో ఆమె వ్యక్తిత్వం బీటలువారిపోయింది. కేవలం తనని చూస్తూ చిత్రాలను వేయటంలో అతను ఏ ఆనందం పొందుతాడు? ఈ ప్రశ్న ఆమెను తీవ్రంగా వేధించసాగింది. ఇలా చిత్రాలు తీయటంలోనే జీవిత మధురిమ నిండివుందా? ఆ జీవితానికి అర్ధముంటుందా? భవిష్యత్తును తీయగా ఊహించుకొనడం వల్లనే తీయగా వుంటుంది. అతని జీవితం అడవిని కాచిన వెన్నెల. జీవితానికి ధ్యేయం ఒక టున్నంతమాత్రాన భౌతికమైన అలవాట్లని విస్మరించాలని ఎక్కడుంది?

రాధ సరదాకే నాట్యం నేర్చుకుంది. తన నాట్యం ఒక కళాకారునికి తోడ్పడగలిగినందుకు సంతోషించింది. ఆ కళాకారుడికి భార్య అయిన తరువాతకూడ గత జీవితపరిసరాలలోకి పోవటం ఇష్టం లేదు. అత నెవరైన తను అతనికి భార్య. భార్యగా తన కెంత బాధ్యత? ఎంత విలువ?గృహిణీత్వం మిధ్యాభినయమేనా? అతను ఆ విలువలను ఇవ్వటంలేదు.

నోరు తెరచి అడిగింది. "సినిమాకి పోదాం" అని. కల్పనమూర్తి నవ్వేసి. "నాట్యరాణివి నీ వుండగా సినిమా లెందుకు?" అన్నాడు.

రోజూ తెమ్మని చెప్పే పౌడరుడబ్బా మరచిపోతూనేవున్నాడు.

జీవితమంతా ఇలాగే గడపాలా?

ఆమె గుండె ఝల్లుమంది.

సూక్ష్మంగా ఆలోచిస్తే తను పొరబాటే చేసింది.

సినిమాకి తీసికెళ్లాలని తెలియనివాడూ, భార్య మనసుపడితే పూలు కొనాలని తెలియనివాడూనా తన భర్త? కళాకారుడుగా అత నెంత గొప్పవాడైనా భర్తగా అత నొక జడస్వరూపుడు. అతని కళాత్మక హృదయపు వెలుగుచుట్టూ ఈ జడత్వం నల్లగా నీడగా వలయాకారంగా చుట్టుకుంది. అందుకే అతను ఆ వెలుగును దాటి రాలేకపోతున్నాడు కర్తవ్యమే అన్నిటినీ మించింది. అదే జీవితాన్ని ప్రకాశవంతం చేసేది. ఏ ఉద్రేకంలో అతను ఆమె నీ క్షుద్ర జీవిత పరిసరాలలోకి లాక్కుని వచ్చాడో అదీ ఆమెకు శాశ్వితమైంది. దానినుండి తప్పించుకోవడానికి ఆమెకు తన స్త్రీత్వమే అడ్డువస్తున్నది. ఇది భగవంతుని ప్రయోగం అందుకే విచిత్రమైనది. ఇక తన జీవితం అర్ధంలేని ప్రహసనమే అవుతుంది. మిణుగురు పురుగును పట్టుకుని చీకటిని ఛేదించుకోవలసిన దుర్గతిని కోరితెచ్చుకుంది! జీవితాన్ని అంతులేని చీకటిరాత్రిని చేసికుంది!

## 6

"కల్పనమూర్తిగారూ!"

రాధ వరండాలోకి వచ్చి "ఎవరండీ?" అంది.

వాకిట్లో ఇద్దరు వ్యక్తులు నిలబడి వున్నారు

"నువ్వా రాధమ్మా. ఇక్కడున్నావేం? కల్పనమూర్తిగారి ఇల్లు ఇదే కదూ?"

"ఇదే ఆయన మావారే!" అంది తల వంచుకుని

"ఇంతకీ నన్ను గుర్తుపట్టలేదా రాధమ్మా" అన్నాడాయన చిరునవ్వుతో.

రాధ పరిశీలనగా చూసింది.

ఆ చిరునవ్వు...ఆ పొన్నుకర్ర... ఎవరు?

"కృష్ణనాయుడుగారు కదూ!" అంది ప్రసన్నవదనాన్ని పైకెత్తి.

నాయుడుగారు మందహాసం చేశారు.

"గుర్తింనా వన్నమాట!"

"ఎలా గుర్తించకుండా వుంటాను. తమరు గొప్ప కళాభిజ్ఞులు! ఇలా వచ్చారేనిటి?" అంది కుతూహలంగా.

"అతనితో పనిమీద వచ్చాను."

"చెప్పండి!"

"ఈ మధ్య ఓ ప్రదర్శలో అతని చిత్రాలు నాలుగు చూశాను. చాల గొప్పగా వున్నాయి. అప్పుడే మాట్లాడాలంటే వీలులేకపోయింది. వాటి కోసరం వచ్చాను."

రాధ మౌనంగా వూరుకుంది.

"ఎంత డబ్బయినా సరే. వాటిని కొనాలనే వచ్చాను."

రాధకి జవాబు దొరకలేదు వాటి నమ్మితే అత నేమంటారో? అమ్మక పోతే ఈయ నేమనుకుంటారో? గొప్ప కళాభిమాని, కళాపోషకుడు అని పేరు పొందిన కృష్ణనాయుడుఅంతవారే వచ్చి అడిగితే ఏలా కాదనటం?

"మాట్లాడ వేమమ్మా?"

రాధ ఈ లోకంలోకి వచ్చింది.

"ఏ చిత్రాలు?" అంది.

నాయుడుగారి ముఖాన దరహాస చంద్రికలు వెల్లివిరిసినయి. మందగమనంతో లోపలికి దారితీశాడు.

రాధ వారి నడ్డలేకపోయింది.

"ఈ నాలుగు."

అవి కల్పనమూర్తి మహత్తర తపస్సుకు ప్రత్యక్షమైన భగవంతుని నాలుగు రూపాలు. ప్రకృతి పురుషుల కేళీవిలాసాన్ని అతి మనోహరంగా చిత్రించిన చిత్రాలు ఏ మహత్తర అనుభూతులలో గాఢ సమాధిలో రాధ ప్రణయతత్వానికి ప్రాణ ప్రతిష్ఠ చేశాడో – ఆ నాలుగు చిత్రాలు ప్రకృతికి సమర్పించిన చిత్రాలు।

"ఇదేనమ్మా; వీటి విలువ సామాన్యం కాదు"

రాధ మాట్లాడలేదు. ఆమె హృదయం కుమిలిపోసాగింది.

"అదే రాధ నువ్వు–నిన్నే రాధని చేశాడు మీ ఆయన. మీ దాంపత్యం గొప్పది" అన్నారు కృష్ణనాయుడుగారు ఆనందంతో అభినందిస్తూ.

రాధకి మాట రాలేదు ఆయన జేబు లోంచి డబ్బు తీసి చేతి కిస్తున్నప్పుడు అందుకోబోతే చేయి వణికింది. ఏ చనువుతో తనకి బంగారు పతకాలను బహూకరించారో ఆ చనువుతోనే ఈ చిత్రాలు తీసికున్నాడు.

"ఇంకా చిన్న పనుందమ్మా. అతను లేడు. అయినా నేను మళ్ళీ వస్తాను. అప్పుడు మాట్లాడుకుందాం.

రాధకి కళ్ళనీళ్ళపర్యంత మైంది. తమ ఆత్మీయమైన వస్తువుల నెవరో దౌర్జన్యంగా తీసుకుపోతున్న ట్లనిపించింది. నిస్పృహాయురాలు, ఏం చేసి ఆ చిత్రాలు తీసుకవెళ్ళకుండా ఆపగలదు?

నాయుడుగారు వెళ్ళబోతూ "ఏ రేం లేదు 'మేఘసందేశం' కావ్యాన్ని చిత్రాలలో ఇముడ్చాలని మహా కోరికగా వుంది. ఎంత ఖర్చయినా సరే అతనితో చెప్పు. మళ్ళీ నేను వస్తాను" అన్నారు.

రాధ యాంత్రికంగా తలూపింది.

నాయుడుగారు వెళ్ళిపోయాక ఆమె దుఃఖా న్నాపుకోలేకపోయింది. ఏడవటాని కింతకన్నా అవకాశ మెక్కడిది? అతన్ని చేజేతులా అవమానించింది. దుఃఖం హృదయపుగట్లు దాటింది ఆశ బ్రద్దలైంది జీవితంపై విరక్తి ఎక్కువైంది క్షణంలో అంతా తల్లక్రిందులైంది.

మూర్తి వస్తూనే రాధని చూసి నిర్ఘాంతపోయాడు. రాధ వివశయై పడిపోయింది. ఆమె చుట్టూ నోట్లు చెదురు మదురుగా పడివున్నాయి. రాధ ముఖంమీద కేశాలు క్లేశాల్లా పడినయి.

"రాధా!" అన్నాడు బరువుగా.

రాధ కళ్ళు విప్పి భర్తను చూసి ఉలికిపడింది. అతన్ని చూడగానే ఆమె హృదయం కాలిపోయింది.

"అలా వున్నావేం రాధా? ఈ డబ్బేమిటి?" అన్నాడు ఓదారుస్తూ.

రాధకీ ఓదార్పు భరించటం దుస్సహమైపోయింది. అతని గుండెల్లో తల దాచుకుని బావురు మంది.

"ఏం జరిగింది రాధా?" అన్నాడు ప్రేమగా

"ఏం జరిగింది? కృష్ణనాయుడుగారు వచ్చారు," అంది వెక్కుతూనే

"వస్తే?"

"మీ చిత్రాలు అమ్మమని అడిగారు"

"ఏ చిత్రాలు?" అన్నాడు ఉడదడలాడిపోతూ.

"అవే..."

కల్పనమూర్తి నిర్విణ్ణుడైపోయాడు.


"అ-మ్మే-శా-వా?" అన్నాడు వణుకుతూ.

రాధ తల దించుకుంది.

అతనికి మతి పోయింది.

"అమ్మేశావా?" అన్నాడు తీవ్రంగా.

అతని ముఖంనిండా స్వేదబిందువులు వెల్లజల్లబడినయి. కళ్ళు ఎర్రబడినయి.




"రాధా" అన్నాడు దుఃఖము కోపము మిళిత మైన కంఠస్వరముతో.

రాధ తప్పు చేసిన దానిలా తల దించుకుంది.

"రాధా, నా ఆరాధ్య దేవతవి నీవు. నా మనస్సులో శాశ్వతంగా ప్రాణం పోసికున్న దానివి అయినా నా హృదయాన్నర్థం చేసికోలేకపోయావు."

రాధ కళ్లోంచి అశ్రుపుష్పాలు రాలుతున్నాయి.

"కేవలం రూపాయిలతోనే జీవిత మాధుర్యాన్ని కొలుస్తావంటే నిన్ను ఈ చాయలకి రానిచ్చేవాడివి కాను. కళాకారి జీవి. కళాకారుడి మనస్సు తెలుసుకో గలవనుకున్నాను. అవి ప్రకృతికి సమర్పించిన చిత్రాలు. వాటిని అమ్మటానికి మన కెలాంటి హక్కూ లేదు." అన్నాడు దీనంగా.

రాధ హృదయం మూగబోయింది.

"ఎందుకు, రాధా నామీద కసి? కళలో సహకరింపవలసినదానవి నీవు. నన్ను అవమానిస్తావా? ఇదంతా డబ్బుకోసం మేనా?"

రాధ జవాబు చెప్పలేదు.

"సర్వోత్కృష్టమైనవి ఆ చిత్రాలు. అవే లేనప్పుడు ఈ జీవిత మెందుకు. నే నేం చేసికోను? ఇక నే నేమి చిత్రించ గలను? నా సౌందర్యోపాసనకి అంతం దొరికింది, నా కళా జీవితం అంతం పూర్తిగా ముగిసిపోతున్నది. నా జీవిత వృక్షానికి ఆశల ఆకులు రాలిపోయినయి. అది మోడై పోయింది. ఏ కరుణా కొమ్మల చివురుల కోసరం ఒకనాడు నా కోటికన్నుల గిన్నెలతో నీరు పోలికించాను. నా ఆశల్ని నీవే త్రుంచి వేశావా, రాధా! కాని ఒకటిమాత్రం

నిజం. నాకు ఒకటే తృప్తి. నేను ఈశ్వరుని తెలుసుకున్నాను. నా ఆత్మ వలననే తెలుసుకున్నాను. నా ఆత్మలో వెలిగే ఆయన ఆనంద రూపాన్ని వని నేను గుర్తించాను. నా ప్రేమవల్లనే ఆయన్ను గుర్తించాను ఆత్మకి ఆత్మే ఈశ్వరుడు "

రాధ అతన్ని ఓదార్చలేకపోయింది. ఏ బలహీనతతో నాయుడుగారికి జవాబు చెప్పలేక పోయిందో ఆ బలహీనతతోనే మూర్తికూడా జవాబుచెప్పలేకపోతున్నది.

"నీవు అమ్మింది నా చిత్రాలు కాదు. నా ఆత్మని రాధా. నా ఆరాధనికి జ్యోతి వవుతా వనుకున్నానుగాని మాయ వవుతా వనుకోలేదు," అన్నాడు ఏడుస్తూ.

రాధ తట్టుకోలేక పోయింది. తను ఘోరమైన తప్పు చేసింది. ఆమె మాట్లాడ లేకపోయింది. ఆమె మనస్సు మర ణించింది ఆమె అతని పాదాలమీద పడి పోయింది. అతని పాదాలు ఆమె కన్నీటి చేత క్షాళిత మైనయి. అతని హృదయం వేయి ముక్కలైంది.

"రాధా! మన ప్రణయం భగ్నమైన అమృత భాండం. రాధాకృష్ణుల ప్రణయ తత్వాన్ని జీవితంలోనే అనుసరించా లని ప్రయత్నించాను. నీవు క్షణికానికి విలువ నిచ్చావు. ఈ దారుణమైన విషాద గాథకి ముగింపు ఇప్పుడే కావాలి. అందిన లక్ష్యం దూరమైతే జీవిత మెందుకు?" అన్నాడు అశాంతితో.

"ఏ – మం – డీ!" అంది ఏడుస్తూ.

అతని గుండె బరువెక్కిపోయింది. చుట్టూ మంచుఆవిరులు. కాలం స్థంభించింది; సృష్టి స్థంభించింది. గది గిరగిర తిరిగి పోతున్నది; శూన్యమైపోతున్నదిజీవితం.

రాధ భయంగా అతనివంక చూసింది. జీవని సృష్టించింది భగవంతుడైతే జీవి తాన్ని నిర్వచించేది స్త్రీ. తను గృహిణి. ధర్మానికి వ్యతిరేకంగా వ్యవహరించింది. అతని జీవిత శిల్పాన్ని సరిగా చెక్క లేకపోయింది అందుకేనా ఈ ఓటమి? ఎలా ఈ ఓటమి స్వీకరించటం?

రాధ వణికిపోతోంది. స్వేదబిందు వులకి నుదుటన తిలకం చెదిరిపోతు న్నది. ఆమె హృదయం దారం తెగిన గాలిపటమే అయింది.

కల్పనమూర్తి నరాలు వణుకుతున్నై. ఆకాశం పాలపొంగులా పొంగుతోంది.

"రాధా! నిన్ను బాధపెడితే నన్ను క్షమించు. ఇదివరకు భౌతికంగా మనం భిన్న జీవితాలు జీవించాం. ఇప్పుడేక మయినాం. ప్రేమ ఏకంచేసింది. నేను కాలాని కతీతమైన శక్తితో, చిత్రాలు వేశాను. మరోవిధంగా అది నా ఆత్మా న్వేషణ. మ నిద్దరికి భేదంలేదు. ప్రేమ యొక్క బిందులే మః నిద్దరి శక్తులు. కాని చిత్రాల విలువ భౌతికంగా అంచనా వేయటమే నీ తప్పు "

దివ్యానుభూతులలోనే మృత్యునీడలు ప్రాకినయి.

రాధకి మాట రావటం లేదే. ఆమెకి

ఎంతో చెబుతామని వుంది. కాని ఏమీ చెప్పలేకపోతున్నది

కల్పనమూర్తి నోరు మూగపోయింది. అధరాలు కంపిస్తున్నాయి ఇక తీగలు తెగిన వీణపై వాయించటమే అతని బ్రతుకు నిజజీవితంలోనూ, కళా జీవితంలోనూ ఓడిపోయాడు ఏ స్త్రీ తన చిత్ర నిర్మాణానికి రాత్రిం బవళ్ళు విశ్రాంతి లేక శ్రమ పడిందో, ఆ స్త్రీ వాటి విలువని గుర్తించలేకపోయింది. వేటన్నిటికీ అతీతురా లనుకున్నాడో ఆ రాధ కోరికలకి బానిస అయింది. అతని గుండెల్లో పిడుగులు వర్షించింది. అగ్ని రగిల్చింది. ఇక మిగిలిందేమిటి ?

చరిత్రహీనుడు తను సుఖ దుఃఖాలు రెండూ అసత్యాలే తన దృష్టిలో. తన హృదయాన్ని ఆనందాన్ని నగ్నంగా చిత్రించాడు. అవే తన ఆస్తి; తన సర్వస్వం. ప్రాణాధికంగా ప్రేమించాడా చిత్రాలను. ఎత్తైన బ్రతుకు శిఖరంమీద మృత్యులోయలోకి పడిపోతున్నాడు

ఇది కలా ? కాదు

అతని హృదయం సుడిగుండాలలో పడి తిరుగుతున్నది క్రమంగా అతను జాగ్రదావస్థను దాటిపోయినాడు గాఢ సుషుప్తిఅతన్నావరించింది. అతనిసుషుప్త శరీరం చుట్టూ నిశ్శబ్దం నృత్యం చేసింది.

రాధకి ఒక్కసారి రెండు రాజ్యాలూ పోయినయి. ఆమె శోకించి శోకించి శిల అయింది.

★

